సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 29 । మార్చి । 2024



క్రీస్తు ప్రాణత్యాగం పాపుల కోసమే

లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందుకు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రైడే. –IIలో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
రాయచోటి :	6.30	4.55
రాజంపేట :	6.31	4.55
పీలేరు :	6.34	4.50
మదనపల్లె :	6.33	5.00




వైఎస్సార్‌సీపీలో చేరికలు

పీలేరు పట్టణానికి చెందిన బిస్మిల్లా ఇంజనీరింగ్ వర్క్స్ అసోసియేషన్, కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 180 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. –IIలో

బాబును లెక్క పెట్టని అసంతృప్తనాయకులు

ఎమ్మెల్యే అభ్యర్థికి సహకరించేది లేదంటూ తిరస్కారం

మదనపల్లె: టీడీపీలోని అసంతృప్త నాయకులను ఏకం చేసి, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుకు మార్గం సుగమం చేద్దామనుకుంటే... మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తమ్ముళ్లు లెక్కపెట్టలేదు. మదనపల్లె ప్రజాగళం సభ నిర్వహణ అనంతరం, పార్టీ గెలుపుకు వ్యూహరచన చేయాలన్న ఆలోచనతో నైట్ హాల్ట్‌కు అంగీకరించిన... చంద్రబాబు నిద్రపోవడం తప్ప చేసిందేమీ లేదు. అసంతృప్త నాయకులను బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. ఏళ్లుగా టీడీపీని నమ్ముకుని, కేసులు పెట్టించుకుని, కోట్లు ఖర్చుచేసి కష్టకాలంలో పార్టీని నిలబెడితే... ఏడాది కిందట పార్టీలోకి వచ్చిన వ్యక్తికి సీటు కేటాయించడం, ఇచ్చేటప్పుడు మాటవరుసకైనా తమను సంప్రదించకపోవడంపై అసంతృప్తితో ఉన్న నాయకులు తమ మొండిపట్టు వీడలేదు. చంద్రబాబు మీతో మాట్లాడాలనుకుంటున్నారని, వర్తమానం మోసుకెళ్లిన దూతలకు అసంతృప్తనాయకులు ముఖం చాటేశారు. ఆయనను కలిసినా తమకు కలిగే ప్రయోజనం లేదని, తమను కాదని ఏరికోరి ఎంచుకున్న అభ్యర్థిని తమ సహకారం లేకుండానే గెలిపించుకోమని ఖరాఖండిగా చెప్పారు. అవసరమైతే బీజేపీ ఎంపీ అభ్యర్థి తరపున ప్రచారమైనా చేస్తామే కానీ, టీడీపీ అభ్యర్థికి సహకరించేది లేదని, నిక్కచ్చిగా తేల్చిపారేశారు. దీంతో బాబు నైట్‌హాల్ట్‌లో అసంతృప్తనాయకులను బుజ్జగించి, తమకు ఇబ్బంది లేకుండా చేస్తాడనుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా ఖంగుతిన్నారు. దీనికితోడు మదనపల్లె ప్రజాగళం సభ ఆశించిన స్థాయిలో విజయవంతం కాకపోవడం, మిత్రపక్షాలు సహకరించకపోవడం, అసంతృప్తనాయకులు మాట వినకపోవడంతో గురువారం ఉదయం తనను కలిసేందుకు వచ్చిన ఇతరులతో చంద్రబాబు అసహనం వ్యక్తం చేస్తూ... చిర్రుబుర్రులాడుతూ... అనంతపురం పర్యటనకు బయలుదేరినట్లు సమాచారం.



ఓం భీమ్ బుష్...

బాబు ఎత్తులకు తమ్ముళ్లు తుస్..

- ఆది నుంచి పార్టీని నమ్ముకున్న వాళ్లకు మొండిచేయి
- రాజంపేట పార్లమెంటు స్థానం బీజేపీకి దక్కడంతో అభ్యర్థుల్లో ఆందోళన
- మదనపల్లెలోనూ కష్టపడిన వారికి కష్టకాలం

సాక్షి రాయచోటి : తెలుగుదేశం పార్టీని నమ్ముకుని ఆవిర్భావం నుంచి అండగా ఉంటున్న వారికి ప్రస్తుతం గడ్డు పరిస్థితులు దాపురించాయి. 'కష్టకాలంలో అండగా ఉన్నారు...అన్ని విధాల ఆదుకోవడంతోపాటు టికెట్ కూడా మీకే' అంటూ ఊసరవెల్లి మాటలతో పార్టీ పెద్దలు బురిడీ కొట్టించారు. పొత్తుల మాయో...లేక బాబు జిత్తులో...డబ్బుల మూటలు తీసుకురాలేరనో గానీ... ఆది నుంచి ఉన్న వారికి టికెట్ల కేటాయింపులో శృంగభంగం తప్పలేదు. జిల్లాలో ఇప్పటికే పలుచోట్ల కొత్త అభ్యర్థులను తెరమీదికి తేవడంతో గరంగరంగా ఉన్న 'దేశం' శ్రేణులకు తాజాగా రాజంపేట పార్లమెంటు స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో ఎమ్మెల్యే అభ్యర్థుల్లోనూ అలజడి ప్రారంభమైంది. అన్నమయ్య జిల్లాలో అధికంగా ముస్లిం మైనార్టీ వర్గాలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల్లో దెబ్బ తగులుతుందన్న ఆందోళన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను వెంటాడుతోంది.

'సుగవాసి' కుటుంబానికి ఎగనామం

రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు కుమారులు సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్‌బాబు టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. సుగవాసి బాలసుబ్రమణ్యంకు రాజంపేట పార్లమెంటు సీటు కేటాయించినట్లు అంతర్గతంగా చెప్పడంతో ఆయన రెండు నెలలుగా అనునిత్యం తిరుగుతున్నారు. పార్లమెంటు అభ్యర్థిగా తనను బలపరచాలని జిల్లాలో తిరుగుతూ...మరోవైపు ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు. ఈ తరుణంలో రాజంపేట పార్లమెంటు స్థానాన్ని బీజేపీకి అప్పజెప్పడంతో కాపు సామాజిక వర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికే సుగవాసి వర్గీయులు సంబంధిత పార్టీ కార్యాలయాల వద్ద టీడీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు కూడా తొలగించారు.

మదనపల్లె, రాయచోటిలోనూ అంతర్గత పోరు

జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లోనూ టీడీపీ అంతర్గత పోరుతో సతమతమవుతోంది. మదనపల్లె తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా షాజహాన్‌బాషాను ప్రకటించడంతో అప్పటి నుంచి టీడీపీ ఇన్‌ఛార్జిగా ఉన్న దొమ్మలపాటి రమేష్ కినుక వహించారు. మరోవైపు రాయచోటిలో ఇదివరకే మండిపల్లికి టికెట్ కేటాయించినా.. అభ్యర్థిని మారుస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పైగా ఇక్కడి టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి స్తబ్దుగా ఉండిపోయారు.

రాజంపేట టికెట్‌పై ప్రతిష్టంభన

కొత్త, పాత అనే తేడా లేకుండా పార్టీకి పనిచేసిన వారికి సంబంధం లేకుండా టిక్కెట్లు అధిష్టానం కేటాయించడంపై శ్రేణులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే రాజంపేట టీడీపీ టిక్కెట్‌కు సంబంధించి కూడా ఇప్పటికే మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయులుకు చెప్పినట్లు సమాచారం. అయితే ఇప్పుడు జిల్లా పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి లేదా సుగవాసి కుటుంబానికి సంబంధించిన బాలసుబ్రమణ్యంకు కేటాయిస్తారని చర్చలు నడుస్తున్నాయి. మరోవైపు జనసేనకు టిక్కెట్ కేటాయిస్తారని ప్రచారం జోరందుకోవడంతో నియోజకవర్గ టీడీపీలో ఉత్కంఠ నెలకొంది.

▸▸ రాజంపేటలో టీడీపీకి షాక్!

రాజంపేట: చంద్రబాబు జిత్తులకు బలైన మరో నేత, పారిశ్రామికి వేత్త గంటా నరహరి. గంటా నరహరి టీడీపీ తరపున ముందుగా రాజంపేట లోక్‌సభ స్థానం టికెట్ ఆశించారు. ఈ క్రమంలో పట్టణంలో అన్న క్యాంటీన్ ను సొంత డబ్బుతో నిర్వహించారు. తాజాగా రాజంపేట లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. తనకు ఎమ్మెల్యే టికెట్ అయినా వచ్చేస్తుందని గంటా నరహరి ఆశించారు. అయితే ఎమ్మెల్యే టికెట్ కూడా వేరే అభ్యర్థికి ఖరారైందని తెలిసి చివరికి మూడు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన స్వార్థం కోసం ఎవరినైనా బలి చేస్తారనే విషయం మరోసారి గంటా విషయంలో బహిర్గతమైందని రాజకీయపరిశీలకులు అంటున్నారు.

▸▸ తంబళ్లపల్లెలో ఆరని జ్వాల

అన్నమయ్య జిల్లాలోని కీలకమైన తంబళ్లపల్లె సెగ్మెంట్‌లో ప్రతిరోజు టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డికి అసంతృప్త నేత శంకర్‌యాదవ్ వర్గీయుల నుంచి నిరసన సెగ తగులుతోంది. అభ్యర్థి ప్రచారానికి వెళ్లిన ప్రాంతంలో శంకర్‌యాదవ్ వర్గీయులు నిరసనలు తెలియజేస్తున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు తంబళ్లపల్లె నేత శంకర్‌యాదవ్‌తో ప్రత్యేకంగా మాట్లాడినా కూడా క్యాడర్ వెనక్కి తగ్గడం లేదు.



విలపిస్తున్న శంకర్‌యాదవ్

▸▸ కోడూరులో నైరాశ్యం

తెలుగుదేశం పార్టీకి సంబంధించిన అభ్యర్థి కాకుండా రైల్వేకోడూరు టికెట్‌ను జనసేనకు కేటాయించడంతో తెలుగుదేశం పార్టీలో నైరాశ్యం అలుముకుంది. ముందే గ్రూపు రాజకీయాలతో టీడీపీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో జనసేనకు టిక్కెట్ కేటాయించడంతో టీడీపీలో అనిశ్చితి నెలకొంది. పైగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి సూచించిన అభ్యర్థికి కాకుండా కొత్త అభ్యర్థికి టిక్కెట్ కేటాయించడంతో టీడీపీ శ్రేణులు రగిలిపోతున్నాయి.

▸▸ టీడీపీకి బీసీలంటే అలుసే!

బి.కొత్తకోట: బీసీలపై చంద్రబాబు ప్రేమ కపట నాటకమేనని, బీసీలంటే టీడీపీకి అలుసేనని చంద్రబాబు మరోసారి రుజువు చేశారు. బీసీ నేత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌కు టికెట్ ఇవ్వకపోగా కనీస హామీ ఇవ్వకపోవడంతో తంబళ్లపల్లె నియోజకవర్గ బీసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగిన సభకు హాజరైన చంద్రబాబును శంకర్ కలిశారు. టికెట్ ఇవ్వని చంద్రబాబు కనీసం బుజ్జగింపు మాటలైన చెప్పకుండా 'నీ విషయం నేను చూసుకుంటాను' అంటూ ముక్తసరి మాటకే పరిమితమయ్యారు. ఈ విషయం నియోజకవర్గంలోని బీసీవర్గాల్లో ప్రచారం జరగడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబును కలిసే ముందు టీడీపీ నేతలు, కార్యకర్తల వద్ద శంకర్ కన్నీటిపర్యంతమయ్యారు. తర్వాత పార్టీ శ్రేణులు చంద్రబాబును కలిసి శంకర్‌కు టికెట్ ఇవ్వాలని కోరారు.

బీసీలకు అవమానం

ఐదేళ్లు పార్టీకి పనిచేయించుకుని శంకర్‌కు టికెట్ నిరాకరించడంపై తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బీసీలు చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వర్గాలకంటే అత్యధిక ఓటర్లు కలిగిన బీసీలపై చంద్రబాబుకు గౌరవం లేదని, అందుకనే అవమానిస్తున్నారని అంటున్నారు. టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ఓటమికి శక్తి వంచన లేకుండా ఓడిస్తామని బహిరంగంగానే చెబుతుండడం గమనార్హం. కాగా శంకర్ విలపిస్తున్న వీడియో, ఫొటోలు వైరల్ అవుతున్నాయి. బీసీలను పార్టీ కోసం వాడుకుని టికెట్ వేరేవాళ్లకు ఇస్తూ మోసం చేస్తున్నారని ఈ వీడియోను షేర్ చేస్తూ బీసీ నేతలు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు.

టీడీపీని ఓడిస్తాం

తంబళ్లపల్లెలో టీడీపీని ఓడించి తీరుతామని బీసీ నేతలు అంటున్నారు. సర్వేల పేరుతో మోసం చేస్తున్నారని, ఎక్కువ మద్దతు పొందిన శంకర్‌కు ఎందుకు టికెట్ ఇవ్వలేదని నిలదీస్తున్నారు. బీసీలను గెంటేసి రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తికి టికెట్ ఇవ్వడం ముమ్మాటికీ చంద్రబాబు బీసీలకు ద్రోహం చేయడమేనని స్పష్టంగా చెబుతున్నారు.

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం లెక్కింపు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో హుండీ ద్వారా రూ.4,72,290ఆదాయం వచ్చింది. గురువారం స్థానిక ఆలయంలో రాయచోటి దేవాదాయశాఖ అధికారి రవికిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మూడునెలల కాలానికి సంబంధించి అమ్మవారి ఆలయానికి వివిధ కానుకల ద్వారా 17 గ్రాముల బంగారు, 260 వెండి వచ్చింది. నగదురూపంలో రూ.4,72,290 ఆదాయం వచ్చినట్లు రెడ్డెమ్మకొండ ఛైర్మెన్ నరసింహారెడ్డి, ఈవోమంజులు తెలిపారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీ రెడ్డెమ్మకొండ పాలకమండలి సభ్యులు మల్లెల వెంకటేష్, నక్కామధుసూదన్, సిబ్బంది బాలకృష్ణ, వెంకటరమణ,మహేష్‌లు పాల్గొన్నారు.

శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో..



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి హుండీ ఆదాయం లెక్కించగా రూ.27,52,579లుగా తేలింది. గురువారం స్వామి వారి ప్రధాన హుండీలతో పాటు ఇతర ఉప ఆలయాల హుండీలు లెక్కించారు. అలాగే 29.900 గ్రాముల బంగారం ఆభరణాలు, వెండి 3.364 కిలలో వెండి వస్తువులు వచ్చినట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డిలు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమం దేవాదాయశాఖ తనిఖీ అధికారి జనార్దన్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ మొత్తం రాయచోటి ఏబీజీబీలో డిపాజిట్ చేస్తున్నట్లు వారు తెలిపారు.

చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరి వరకు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: కాచిగూడ-చెంగల్పట్టు మధ్య నడుస్తున్న చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు వారంలో మూడు రోజులు కాచిగూడ నుంచి పుదుచ్చేరికి ఆది, బుధ, గురు వారాల్లో, పుదుచ్చేరి నుంచి కాచిగూడకు సోమ, గురు, శుక్ర వారాల్లో నడుస్తుందన్నారు. వేల్మరువత్తూరు, విల్లుపురం, పుదుచ్చేరి స్టేషన్లలో ఈ రైలు ఆగుతుందన్నారు. ప్రస్తుతం ఈ రైలు 17651/17652 నంబర్ల పేరుతో నడుస్తోందని, జులై 8వ తేదీ నుంచి 17653/17654గా మార్పు చేస్తారన్నారు.

కమనీయం.. కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి వారి కల్యాణోత్సవం కన్నులపండుగగా జరిగింది. గురువారం స్వాతి నక్షత్రం కావడం, ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కనుల పండువగా శ్రీలక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఉపాధి కూలీ పెంపు

కడప సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా వివిధ పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సగటు వేతనం పెరిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన వేతనం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి రానుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లాలో మరింత బడ్జెట్ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం సగటు వేతనం రూ. 272 ఉండగా రూ. 28లుగా పెరిగి మొత్తం రూ. 300కు చేరింది. దీంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంసీసీ అమలులో నిక్కచ్చిగా వ్యవహరించాలి

కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్

రాయచోటి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎంసీసీ నిబంధనలు పాటించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆయన తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఎంసీసీ నిబంధనలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. గ్రామ స్థాయిలో రాజకీయ పార్టీలకు సంబంధించి బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్స్ ఉంటే తొలగించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలలో హోర్డింగులు ఉండకూడదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఆర్పీలు, వాలంటీర్లు, రాజకీయ పార్టీ నాయకుల వెంట ర్యాలీలలో ప్రచార కార్యక్రమాలలో పాల్గొనకుండా చూడాలన్నారు.



ఎన్నికల నిబంధనలు పాటింపుపై వివరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

యథావిధిగా పెన్షన్ల కార్యక్రమం

ప్రతి నెల 1వ తేదీన వాలంటీర్ల ద్వారా పంపిణీ చేసే వ్యవస్థ కార్యక్రమం యథావిధిగా కొనసాగాలని కలెక్టర్ చెప్పారు. వలంటీర్లు ఎంసీసీ నిబంధనలు పాటిస్తూ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరగాలన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓలకు సూచించారు. కర్ణాటక బార్డర్ పోలీస్ చెక్‌పోస్టులను విజిట్‌చేసి లిక్కర్ సరఫరా కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్‌ఓలు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచార కార్యక్రమాలకు సంబంధించి ముందస్తు అనుమతులను తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు డోర్ టు డోర్ ప్రచారాలకు కూడా ముందస్తుగా అనుమతులు పొందాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 18004257090 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఎవరైనా కాల్ చేయవచ్చునని పేర్కొన్నారు.

ప్రచార ప్రకటనలకు అనుమతులు తప్పనిసరి

సినిమా థియేటర్లలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు రాజకీయ పార్టీల నేతలు, థియేటర్ మేనేజ్మెంట్ తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంసీసీ అములులో ఉన్నంతవరకు రాజకీయ పార్టీల నేతలు, థియేటర్ మేనేజ్మెంట్ ఎంసీసీకి లోబడి ప్రవర్తించాలన్నారు.

ఫలితం.. త్వరితం!

- ముగిసిన పదో తరగతి పరీక్షలు
- జవాబు పత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు ముమ్మరం
- సిబ్బంది నియామకం పూర్తి
- ఏప్రిల్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూల్యాంకనం



పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించిన ప్రభుత్వం మరో ఘట్టంలోకి అడుగుపెడుతోంది. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులు రాసిన సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించిన మూల్యాంకన కార్యక్రమాన్ని కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ మూల్యాంకన కార్యక్రమం ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జరగనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్షన్నర పేపర్లు మూల్యాంకనానికి రానున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1122 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీరిలో మూల్యాంకనం నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జామినర్లతోపాటు వాటిని పరిశీలించేందుకు చీఫ్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ క్యాంపు ఆఫీసర్గా, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. అలాగే మరో ఏడుగురు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా ఉంటారు.

ముగ్గురు ఏఈలకు ఒక సీఈ, స్పెషల్ అసిస్టెంట్

విద్యార్థుల సమాధాన పత్రాలను మూల్యాంకనం నిర్వహించేందుకు ముగ్గురు చొప్పున అసిస్టెంట్ ఎగ్జామినర్లను(ఏఈ) ఒక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. ముగ్గురు ఏఈలకు ఒక చీఫ్ ఎగ్జామినర్(సీఈ)తో పాటు ఒక స్పెషల్ అసిస్టెంట్ ఉంటారు. ఒక్కొక్క ఏఈ రోజుకు 40 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఏఈలు మూల్యాంకనం చేసి పత్రాలను సీఈలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. విద్యార్థులు రాసిన సమాధానాలు సరైనవి, కానివి పరిశీలించి వేసిన మార్కులను నిశిత పరిశీలన చేస్తారు. అదే విధంగా జవాబు పత్రాల్లో ఏఈలు వేసిన మార్కులను కూడి టోటల్ మార్కులను వేసే విధులను స్పెషల్ అసిస్టెంట్లు నిర్వహిస్తారు. ఈ విధంగా ఒక బృందం రోజుకు 120 సమాధాన పత్రాలను మూల్యాంకనం జరిపి మార్కులు వేయడంతో పాటు వేసిన మార్కులు సరిగా ఉన్నవి, లేనివి క్షుణ్ణం తనిఖీ చేస్తారు. క్యాంపు అధికారికి సహాయకులుగా సహాయ క్యాంపు అధికారులను నియమిస్తారు. సీనియర్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు మూల్యాంకన విధుల్లో సీఈ, ఏఈ, స్పెషల్ అసిసెంట్లుగా వ్యవహరించనున్నారు.

1122 మంది సిబ్బంది నియామకం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రానున్న దాదాపు 1,50,000 పేపర్లను మూల్యాంకనం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 1122 మంది సిబ్బందిని విధులకు ఏర్పాటు చేశారు. ఇందులో చీఫ్ ఎగ్జామినర్లుగా 100 మందిని, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 583 మందిని, స్పెషల్ అసిస్టెంట్లుగా 439 మందిని ఇలా మొత్తంగా మూల్యాంకన విధులకు 1122 మందిని నియమించారు. ఈ మూల్యాంకనాన్ని ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. మూల్యాంకన విధులకు హాజరయ్యే సిబ్బందికి అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాటు చేసింది.

▸▸ పక్కాగా నిబంధనలు అమలు

పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. గుర్తింపు కార్డు ఉన్న వారినే ఆ ప్రాంతంలోకి అనుమతించనున్నారు. మూల్యాంకనం జరుగుతున్న అన్ని రోజులు అటు వైపు ఇతరులు రాకుండా ఆంక్షలు విధిస్తున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది సెల్‌ఫోన్, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను వెంట తీసుకెళ్లడానికి వీలు లేకుండా నిబంధనలను జారీ చేయనున్నారు. విధులకు కేటాయించిన సిబ్బంది ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు మూల్యాంకన కేంద్రంలో ఉండాల్సి ఉంది. సిబ్బందికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు.

పటిష్ట ఏర్పాట్లు



ఏప్రిల్ 1నుంచి నిర్వహించనున్న పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నాము. మూల్యాంకన విధులకు హాజరయ్యే సిబ్బందికి అవసరమైన తాగునీరు, గదుల్లో లైటింగ్‌తో పాటు ఫ్యాన్లు, టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నాము. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కనుక సిబ్బంది చాలా జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మార్కులు వేసే విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

– మర్రెడ్డి అనురాధ, డీఈఓ


సెలవు దినాల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం

కడప కార్పొరేషన్: ఈనెల 29, 31 తేదీల్లో సెలవు దినాలైనప్పటికీ వినియోగదారుల సౌకర్యం కోసం విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ ఎస్ఈ ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ గుడ్ ఫ్రైడే, 31వ తేదీ ఆదివారం రోజుల్లో కూడా వినియోగదారులు తమ బిల్లులను చెల్లించి సంస్థ ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

తాగునీటి సమస్యలపై కాల్ సెంటర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వాటి పరిష్కారం కోసం కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తితే 9100 12 2302 నెంబరుకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



మునగా సతీష్

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మునగా సతీష్ కుమార్, వైస్ చైర్మన్లుగా జీఎస్టీ లక్ష్మణ్‌రావు, తలుపుల నాగేంద్రలను ఎంపిక చేశారు. వీరు ముగ్గురు ఈనెల 31వ తేదీ ఆదివారం చిన్నచౌకులోని ఆదిత్య కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

క్లుప్తంగా

జూదరులు అరెస్ట్

మదనపల్లె : జూదమాడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్. శేఖర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని బసిని కొండ గ్రామం సమీపంలో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో మదనపల్లె కు చెందిన సి అశోక్ కుమార్(33), బి అనిల్ కుమార్(30), కే అన్నయ్య(29), ఎస్ శ్రీనివాసులు(44), ఎస్ మహబూబ్ బాషా(52), సుబ్రహ్మణ్యం(66), కె గిరీష్(29), కడపకు చెందిన ఏ. చంద్రశేఖర్ (42), టి మల్లికార్జున (38)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 13,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు


గాయపడిన నరసమ్మ

మదనపల్లె : చెట్టు పై నుంచి పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. బొమ్మలచెరువు పంచాయితీ టీకలపాలెం కు చెందిన సుబ్బయ్య భార్య నరసమ్మ (45) మేకలు మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్ళింది. మేకల మేత కై చెట్టు పైకి ఎక్కి కొమ్మలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

క్రీస్తు ప్రాణత్యాగం పాపుల కోసమే

- నేడు గుడ్‌ఫ్రైడే
- ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన చర్చిలు


శిలువపై బలియాగమైన ఏసుక్రీస్తు

రాజంపేట టౌన్ : క్రీస్తు అనగానే క్షమ, కరుణ గుణాలు గుర్తుకు వస్తాయి. లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందుకు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రైడే. దీనినే శుభశుక్రవారం అని కూడా అంటారు. తన ఆత్మబలిదానంతో పాపులకు దేవుని పరిశుద్ధ సన్నిధిలో స్థానం కల్పించిన ఈ శుక్రవారాన్ని ప్రపంచంలోని క్రైస్తవులు, విశ్వాసులు శుభశుక్రవారంగా భావిస్తారు. దయామయుడైన క్రీస్తు శిలువపై చిందించిన రక్తం మానవాళికి శుభాలను సమకూర్చింది కనుక గుడ్‌ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. ఈ శుక్రవారం నాడే కల్వరిగిరిపై క్రీస్తును శిలువపై శిక్షించారు. జిల్లాలోని క్రైస్తవులు, విశ్వాసులు గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అందులో భాగంగా పాస్టర్లు చర్చిల్లో ఉపవాస ప్రార్థనలను నిర్వహించనున్నారు. ఇందుకోసం చర్చిలను శోభాయమానంగా ముస్తాబు చేశారు.

ముగిసిన లెంట్‌డేస్

గుడ్‌ఫ్రైడేని పురస్కరించుకొని క్రైస్తవ లోకం 40 రోజుల పాటు లెంట్‌డేస్ (శోకదినాలు) నిర్వహించింది. ఈనెల 24వ తేదీ నిర్వహించిన మట్టల ఆదివారంతో లెంట్‌డేస్ ముగిశాయి. లెంట్‌డేస్‌లలో అనేక మంది క్రైస్తవులు శుభకార్యాలకు దూరంగా ఉన్నారు. నిరంతరం క్రీస్తు ధ్యాసలోనే గడిపారు. చర్చిలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా మౌనంగా ప్రార్థనలు నిర్వహించారు. లెంట్‌డేస్ ముగిసిన తరువాత వస్తున్న శుభశుక్రవారాన్ని, ఆదివారం నిర్వహించే పునరుత్థానం పండుగలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మహోన్నతమైన రోజు



మానవుల పాప నివారణకు ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజే గుడ్‌ఫ్రైడే. ఇది మానవులందరికి ఓ మహోన్నతమైన రోజు. ఏసుక్రీస్తునందు విశ్వాసం ఉంచిన వారు పాపముల నుంచి విముక్తి పొంది నిత్యజీవము పొందెదరు.

– విశ్వప్రసాద్, పాస్టర్, నిజస్వరూపుని ప్రార్థనా మందిరం, రాజంపేట

పునరుత్థానమే ఈస్టర్..

కల్వరి కొండమీద శిలువపై మరణించిన క్రీస్తును అక్కడి కొండ గుహలో సమాధి చేశారు. మూడవ రోజు ఆదివారం ఏసుక్రీస్తు పునరుత్థానం పొంది తిరిగి తన శిష్యులకు దర్శనమిచ్చారు. 'నేను జీవమును' అన్న మాటకు నిదర్శనంగా నిలిచి లోకానికి తన దివ్య మహిమను చాటాడు. ఆయన పునరుత్థానం చెందిన ఆదివారాన్నే ఈస్టర్ వేడుకగా క్రైస్తవులు, విశ్వాసులు నిర్వహించుకుంటారు.

పొలతలలో హుండీ కానుకలు లెక్కింపు

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీల ఆదాయాన్ని గురువారం దేవాదాయశాఖ ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. మల్లేశ్వరస్వామి, పార్వతి దేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి హుండీ కానుకలను లెక్కించగా రూ.30,75,482 లక్షలు నగదు లభించిందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నాగమల్లారెడ్డి, ఆలయ ఈఓ శ్రీనువాసులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లింగాల : లింగాల మండలం దొడ్లవ గ్రామానికి చెందిన తుమ్మలూరు సునీల్ కుమార్ రెడ్డి (30) అనే వ్యక్తి గురువారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ బీవీ కృష్ణయ్య వివరాల మేరకు....సునీల్ కుమార్ రెడ్డి గత ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉండే వాడని తెలిపారు. కడుపు నొప్పి తాళలేక ఆయన ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగర శివార్లలోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కార్యాలయంలో వాహనాల షోరూం యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు నూతన వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్ బిగించవలసిన బాధ్యత వాహనాలు అమ్మిన షోరూం వారిదేనన్నారు. ఆర్టీఓ మురళి, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు విజయభాస్కర్, ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, వేణు, నారాయణ నాయక్ లు కడప, ప్రొద్దుటూరులోని వివిధ షోరూంలను సందర్శించి హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్ల అమలును పరిశీలించారు. హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కువైట్‌లో యువకుడు అనుమానాస్పద మృతి


ఎల్లారెడ్డి (ఫైల్)

సంబేపల్లె : మండలంలోని దేవపట్లకు చెందిన సనికిరెడ్డి ఎల్లారెడ్డి (36) అనే యువకుడు కువైట్‌లో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దేవపట్లకు చెందిన ఆదిరెడ్డి, రెడ్డమ్మ దంపతుల కుమారుడు ఎల్లారెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా బతుకుదెరువు కోసం కువైట్ దేశానికి వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు మూడు రోజుల్లో ఇంటికి వస్తానని ఇటీవల ఫోన్ ద్వారా తమకు తెలిపాడని.. అయితే సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడని కువైట్ నుంచి ఫోన్ ద్వారా సమాచారం వచ్చిందని ఎల్లారెడ్డి కుటుంబసభ్యులు వాపోతున్నారు. కాగా ఎల్లారెడ్డి మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబసభ్యులు చెబుతున్నారు. మృతునికి వివాహం కాలేదు.

అపస్మారకస్థితిలోని వృద్ధురాలు ఆసుపత్రికి తరలింపు


చికిత్స పొందుతున్న వృద్ధురాలు సాయమ్మ

మదనపల్లె : అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ గుర్తు తెలియని వృద్ధురాలిని స్థానికులు మానవత్వంతో ఆసుపత్రికి చేర్చిన ఘటన పట్టణంలో జరిగింది. గురువారం పట్టణంలోని ఎస్బీఐ కాలనీలో దాదాపు 80 సంవత్సరాల వయసు కలిగిన ఓ గుర్తు తెలియని వృద్ధురాలు అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే 108కు సమాచారం అందించి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్సలు అందించడంతో ఆమె కోలుకొని ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో ఆమె వివరాలు తెలుసుకునేందుకు ఆసుపత్రి వర్గాలు ప్రయత్నించాయి. తన పేరు సాయమ్మ అని తన ఊరు కర్నాటకలోని కేజీఎఫ్ అని మాత్రమే చెబుతోంది. మిగతా వివరాలు చెప్పలేకపోవడంతో, ఆమెకు సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సంప్రదించాల్సిందిగా మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలి దేవి కోరారు.

వివాహ వేడుకలో వైఎస్ విజయమ్మ


వివాహానికి హాజరైన వైఎస్ విజయమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్‌లో జరిగిన ఆదిరాజు వేణుగోపాల్ రాజు అన్న కుమార్తె వివాహానికి గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాతృమూర్తి వైఎస్ విజయమ్మ హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివాహానికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, పెన్నా ప్రతాప్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, బంధువులు, స్నేహితులు పెద్దఎత్తున హాజరయ్యారు.

రెండు వాహనాలు ఢీ


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పుల్లంపేట : కడప-చెన్నై జాతీయ రహదారి ఏపీ ఆదర్శపాఠశాల వద్ద గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొన్నాయి. తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న మహేంద్ర స్కార్పియో (ఏపీ4040ఏ8385), కడప నుంచి తిరుపతికి వెళ్తున్న (టీఎస్03ఎం4449) సెవ్రెడ్ కారు ఎదురెదురుగా రావడంతో ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో కారు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. అయితే ఆ వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

గాయపడిన విద్యార్థి మృతి


షాహిల్ మృతదేహం

రైల్వేకోడూరు అర్బన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. రైల్వేకోడూరు మండలంలోని మారావారిపల్లి ప్రధాన రహదారిపై ఈనెల 26వ తేదిన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు విద్యార్థులను ఆర్టీసీ బస్సు ఢీ కొన్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ శెట్టిగుంట పెద్దపాడు గ్రామానికి చెందిన షాహిల్ (16) అనే విద్యార్థి గురువారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు సీఐ బాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆచూకీ తెలపండి


షేక్ సయ్యద్ మీర్

మదనపల్లె : పట్టణంలోని అనపగుట్టకు చెందిన షేక్ సయ్యద్‌మీర్(55) గురువారం మధ్యాహ్నం నుంచి కనపడటం లేదని కుటుంబసభ్యులు ఫిర్యాదుచేశారని టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ యువరాజు, సెల్‌ఫోన్ నెంబర్ 9491074519 లేదా ఎస్ఐ వెంకటసుబ్బయ్య సెల్‌ఫోన్ నెంబర్ 9440736741 లకు సమాచారం అందించాలని కోరారు.

బండలాగుడు పోటీలు



పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో శ్రీ మాధవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్ర స్థాయి న్యూ కేటగిరి వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం 12 జతల ఎద్దులు పాల్గొనగా వాటిలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు వరుసగా రూ. 50 వేలు, రూ.40 వేలు, రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు బహుమతులు అందజేశారు. కమిటీ సభ్యులు బాబురెడ్డి, బి.చెన్నారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రామక్రిష్టారెడ్డి, పోచ్చిరెడ్డి పాల్గొన్నారు.

నాటు సారా బెల్లం ఊట ధ్వంసం

కొండాపురం : మండలంలోని దొబ్బుడుపల్లె గ్రామ సమీపంలో గురువారం నాటు సారా తయారు చేసేందుకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జె. చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. స్థానికుల సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి నాటు సారా తయారు చేస్తున్న బెల్లం ఊటను ఎస్బి కానిస్టేబుల్ శివ, కానిస్టేబుల్ నరసింహులతో వెళ్లి ధ్వంసం చేశామన్నారు.

ఎంసీసీ ఉల్లంఘనల అడ్డుకట్టకు ఎంసీఎంసీ

- పెయిడ్ న్యూస్‌పై నిఘా
- రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

కడప సెవెన్‌రోడ్స్ : పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. షెడ్యూల్ నుంచి ఫలితాల ప్రకటన వరకు ఇది అమలులో ఉంటుంది. ఎన్నికల్లో నిష్పక్షపాత మీడియా పాత్రను భారత ఎన్నికల సంఘం ఆశిస్తోంది. పెయిడ్ న్యూస్ ద్వారా విఘాతం కలగకుండా అడ్డుకునేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతోపాటు పెయిడ్ న్యూస్‌ను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. మీడియా ఉ ల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్య లు చేపడుతుంది.

- జాతీయ, రాష్ట్ర పార్టీలు, రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలను ఇచ్చేందుకు మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిష్టర్ కాని పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటనల ప్రసారం కోసం ఏడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అందిన రెండురోజుల్లోపు ఎంసీఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందురోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ అనుమతి పొందిన తర్వాతే ఆ ప్రకటనలను ప్రచురించాల్సి ఉంటుంది.

ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి ..

అన్ని రకాల టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, డిజిటల్, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా పంపే ఎస్ఎంఎస్, వాయిస్ మెసెజ్‌లు ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, గుగూల్ వెబ్‌సైట్స్ వంటివి సామాజిక మాధ్యమాలు కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయి. సినిమా హాళ్లలో, ప్రైవేటు ఎఫ్ఎం రేడియోలలో, ఎలక్ట్రానిక్ పత్రికల్లో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలకు కూడా ముందస్తు ధృవీకరణ తప్పనిసరి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎంసీఎంసీ టెలికాస్ట్ సర్టిఫికెట్ పొందిన తర్వాతే ప్రచారం చేపట్టాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ప్రకటనలు ఎందులో ఇవ్వదలుచుకున్నారో ఆ మేరకు సీడీలో వీడియో, ఆడియో రికార్డు చేసుకుని ప్రకటన టైటిల్, ప్రకటన తయారీకి అయిన ఖర్చు, ప్రకటనలు ఇచ్చేందుకు అయ్యే ఖర్చు వంటివి సూచిస్తూ దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లోని ఎంసీఎంసీ కమిటీకి రెండు సెట్ల దరఖాస్తు ఇవ్వాలి. సర్టిఫికెట్ లేని ఎన్నికల ప్రకటనలు ఎవరూ ప్రదర్శించడానికి వీలు లేదు. అనుమతి పొందిన ఆర్డర్ నెంబరును సంబంధిత ప్రకటనపై సూచించాల్సి ఉంటుంది. ఎంసీఎంసీ అనుమతి లేకుండా జరిగే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనల కింద పరిగణిస్తారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వీటిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి సూచిస్తున్నారు.

180 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి


వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

పీలేరు : పీలేరు పట్టణానికి చెందిన బిస్మిల్లా ఇంజనీరింగ్ వర్క్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 180 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి నివాసంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రతి ఒక్కరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.వి. రాకేష్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, ఎన్.వి. చలపతి, మహితా ఆనంద్, ఉదయ్, గిరిధర్‌రెడ్డి, చక్రధర్, నాగభూషణం, కృష్టారెడ్డి, షాకీర్, అంబికాపతి ఆచారి, బాబ్జి, బాబావల్లి, తనీవ్వర్, రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కలకడ : తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గురువారం కలకడ మండల పర్యటనలో ఉన్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోదరుడు చింతల శివానందరెడ్డి సమక్షంలో కలకడ మండలం, బాలయ్యగారిపల్లె పంచాయతీ బాకిమానివడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అన్నయ్య, రెడ్డిమోహన్, వెంకటేశ్వరలు వారి కుటుంబసభ్యులతో కలసి కన్వీనర్ కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. చింతల శివానందరెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు జివికిషోర్ పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు ప్రజలు నమ్మరు

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి కాకుండా మదనపల్లిగా మారుస్తామంటూ చంద్రబాబు నాయుడు చెబుతున్న మాయమాటలను నమ్మే పరిస్థితులలో ప్రజలు లేరని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటిలో ఆయన మీడియాతో మాట్లాడారు. మదనపల్లి పర్యటనలో భాగంగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై శ్రీకాంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ ఎన్నికలలో ఓటమి తప్పదని తెలుసుకున్న బాబు తాము అధికారంలోకి వస్తే జిల్లా కేంద్రంగా మదనపల్లిను చేస్తామంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సచివాలయ వ్యవస్థను గ్రామాలలో ఏర్పాటు చేయడంతోపాటు జిల్లా కేంద్రాల వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు మరింత చేరువైన పాలనను అందజేస్తున్నారన్నారు. ఇప్పటికే అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో కలెక్టర్ బంగ్లా నిర్మాణపు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాట్ అప్రూవల్ అయ్యిందన్నారు. ఈ పనులకు టెండర్‌ప్రక్రియ కూడా పూర్తి అయిందన్నారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణాలను పూర్తి చేసిన కెసిపి సంస్థ ఈ టెండర్‌ను దక్కించుకుందన్నారు. జిల్లా కేంద్రంలో శాశ్వత నిర్మాణాలకు చర్యలు జరుగుతూ ఉంటే మీకు, మీ అనుచరులకు కళ్లు మూసుకుపోయాయా అని చంద్రబాబును ఆయన ప్రశ్నించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు నిజమైన రాజకీయ నాయకులు చేసే పనికాదన్నారు. చంద్రబాబు మదనపల్లిను జిల్లా కేంద్రం చేస్తానని ప్రకటించి ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఓట్లకోసం ప్రాంతాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం చంద్రబాబు మానుకోవాలని హితవు పలికారు. ప్రజలకు సేవచేసే ప్రజా ఆశీస్సులు పొందుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం సబబు కాదన్నారు. సొంత జిల్లాలో చంద్రబాబు ప్రజాదరణను కోల్పోయారని ఆరోపించారు. ప్రజలకు మంచి పనులు చేసి చంద్రబాబు కంటే పదింతలు ప్రజాదరణ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పొందారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన బాబు సొంత జిల్లాకు, రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో మదనపల్లెలోని చారిత్రక నేపథ్యం గల బిటి కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా డాక్టర్ అనిబిసెంట్ యూనివర్సిటీగా అభివృద్ధి చేయడం, రూ. 500 కోట్ల నిధులతో మెడికల్ కళాశాల నిర్మాణపు పనులు చేపట్టామన్నారు. మదనపల్లె - తిరుపతి రహదారిని నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. పీలేరు బైపాస్ రోడ్డు నిర్మాణపు పనులు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో వందలకోట్ల రూపాయల నిధులతో గ్రామీణ ప్రాంతాలలో సైతం రహదారులను నిర్మించారన్నారు. జిల్లా కేంద్రానికి అవసరమైన వనరులను ఇప్పటికే ప్రభుత్వం సమకూర్చి వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చిందన్నారు. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా పక్కా ప్రణాళికలతో యాభై ఏళ్లకు సరిపోయే తాగునీటి వనరుల పనులు ఇంకోవైపు నడుస్తున్నాయని చెప్పారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత ప్రాతిపదికన భవన నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. జిల్లా కేంద్రంలో రహదారుల విస్తరణను చేపట్టామన్నారు. రాయచోటి జిల్లా కేంద్రాన్ని మారుస్తామని చంద్రబాబు ప్రకటిస్తుంటే ఈ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు నోరుమెదపకపోవడం ఏమిటని శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు.